క్లుప్తంగా

పురిటిపెంటలో వైద్య శిబిరం



వైద్యసేవలందిస్తున్న డాక్టర్ సాయికృష్ణారెడ్డి, సిబ్బంది

గజపతినగరం: పురిటిపెంట గ్రామసచివాలయం-2లో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సాయి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం 104 వైద్యశిబిరం నిర్వహించారు.శిబిరంలో 82 మందికి సిబ్బందితో కలిసి వైద్యా ధికారి వివిధ పరీక్షలు చేశారు.అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం గృహ సందర్శన చేసి వైద్యశిబిరానికి రాలేకపోయిన వృద్ధులు, గర్భిణులకు వైద్యతనిఖీలు చేసి, ఆరోగ్య జాగ్రత్తలను సూచించారు.

కోడి పందెం రాయుళ్ల అరెస్ట్

గంట్యాడ: కోడి పందాల స్థావరంపై పోలీసులు మంగళవారం దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. గంట్యాడ మండలంలోని చినమధుపాడు గ్రామశివారులో కోడి పందాలు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో మంగళవారం సాయంత్రం ఆ స్థావరంపై దాడి చేశారు. కోడి పందాలు నిర్వహిస్తున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రెండు కోడిపుంజులు, ఏడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు.

అవగాహన

గంట్యాడ: మండలంలోని బుడతానపల్లి గ్రామస్తులకు క్షయ వ్యాధిపై హెల్త్ ఎడ్యుకేటర్ ఎర్రన్న మంగళవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధిపై అవగాహన అవసరమని, వ్యాధిని త్వరగా గుర్తించగలితే నివారణతో పాటు ఇతరులకు వ్యాధి వ్యాప్తి చెందకుండా చూడవచ్చని తెలిపారు. రెండు వారాలకు మించి దగ్గు, జలుబు, జ్వరం, బరువు తగ్గడం, చెమటలు పట్టడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంట నే పీహెచ్‌సీకి వెళ్లి కఫం పరీక్ష చేయించుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక సర్పంచ్ అలమండ వాణితో కలిసి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.టీబీ సూపర్ వైజర్ శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సంఘ సభ్యుల సమావేశం

శృంగవరపుకోట: మండలంలోని వశి గ్రామ పంచాయతీలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కారుకొండ సత్యవతి ఆధ్వర్యంలో మహిళా సంఘ సభ్యుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఐదు నెలలుగా సీసీ ఎందుకు సమావేశాలు ఏర్పాటు చేయలేదో చెప్పాలని ఏపీఎంను మహిళలు ప్రశ్నించారు. 29 సంఘాల నుంచి రూ.87 వేలను వసూలు చేసి మహిళా మార్ట్‌లో పెట్టుబడులుగా పెట్టారని, మూడేళ్లు గడుస్తున్నా లాభాలుగా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. గ్రామంలో వీఓఏగా పనిచేసిన త్రివేణిని ఏ కారణంతో తొలగించారని ప్రశ్నించారు. స్పందించిన ఏపీఎం.. తాము వచ్చి రెండు నెలలే అవుతోందని తమకు ఈ విషయం తెలియదన్నారు. మళ్లీ సమావేశం నిర్వహించి, మెజార్టీ సంఘాల తీర్మానం మేరకు నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

14న సాగునీటి సంఘాల ఎన్నికలు

వేపాడ: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 14వ తేదీన జరిగే సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై మంగళవారం అవగాహన కల్పించారు. ఎన్నికలు ఏ విధంగా చేపట్టాలి.. ఎన్నికల నిబంధనలు, విధివిధానాలను ఇరిగేషన్ ఏఈ హేమకుమార్ వివరించారు. ఈ ఎన్నికల విధుల నుంచి ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బందికి మినహాయింపు ఇవ్వడం వల్ల విజయనగరం మున్సిపాలిటీ నుంచి 60 మంది సిబ్బందిని తీసుకుంటున్నామన్నారు.

ట్యూటర్లను నియమించండి

కొత్తవలస: చదువులో వెనకబడిపోతున్నాం.. సబ్జెక్టులలో సందేహాల నివృత్తికి ట్యూటర్లను నియమించాలని కొత్తవలస బీసీ సంక్షేమ బాలికల వసతి గృహం పదో తరగతి విద్యార్థినులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. 8 మంది విద్యార్థులమే ఉన్నామని ట్యూటర్లను నియమించకపోతే ఎలా అని ప్రశ్నించారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నాయని, ట్యూటర్లను నియమించి అభ్యసన సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇదే విషయంపై జిల్లా బీసీ సంక్షేమ సహాయాధికారి యశోధరావు స్పందిస్తూ నిబంధనల ప్రకారం ట్యూటర్ల నియామకానికి హాస్టల్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు 10 మంది ఉండాలన్నారు.

ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

బొండపల్లి: మార్గశిర శుద్ధ దశమిని పురస్కరించుకుని దేవుపల్లి గ్రామంలోని రాజరాజేశ్వరీ దేవి ఆలయంలో అర్చకులు దూసి శ్రీధర్ శర్మ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని విశేషంగా అలంకరించారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఘటాలు,ప్రభలతో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

- గత ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటివద్దకే పథకాలు, సేవలు
- ప్రస్తుతం సచివాలయాల్లో చాలా పౌరసేవలకు కత్తెర
- పింఛన్ కావాలంటే ఎవరికి చెప్పాలో తెలియని దుస్థితి
- రేషన్ కార్డు కోసం ఎక్కడ దరఖాస్తు చేసుకోవాలో స్పష్టత కరువు



చీపురుపల్లి గ్రామ సచివాలయం(ఫైల్)

సేవలు దూరం.. ప్రజలకు భారం



చీపురుపల్లి మండలంలోని ఇటకర్లపల్లి గ్రామానికి చెందిన ఈమె పేరు శనపతి సత్తెమ్మ. ఈమె భర్త తాడు తాడు మరణించాడు. ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలకు వివాహాలు జరిగి వెళ్లిపోగా, బతుకు తెరువు కోసం కొడుకులు విశాఖపట్నంవలస వెల్లారు. ఈమెకు అర ఎకరం పొలం మాత్రమే ఉంది. 2023 నవంబర్ 9న సత్తెమ్మ భర్త తాడు మరణించాడు. అంతవరకు ఆయనకు ఫించన్ వచ్చేది. ఆయన మరణించడంతో మరణ ధ్రువీకరణ పొందడానికి కొంత సమయం పట్టగా ఆ తరువాత దరఖాస్తు చేసుకుంది. అంతలోనే ఎన్నికలు రావడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కానీ ఇంతవరకు ఆమెకు ఫించన్ మంజూరు కాలేదు. ఎలాంటి ఆధారం లేని సత్తెమ్మ కనీసం ఆర్థిక ఆసరా లేక జీవనానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది.' ఇలా శనపతి సత్తెమ్మ మాత్రమే కాదు ఎంతో మంది లబ్ధిదారుల పరిస్థితి ఇది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల నుంచి ప్రభుత్వ సేవలన్నీ గ్రామాల్లోనే సచివాలయాల ద్వారా అందేవి. ప్రస్తుతం సచివాలయాల్లో చాలా వరకు సేవలు నిలిచిపోవడంతో మండల కేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొంది.

చీపురుపల్లి: అర్హులకు పథకాలు, ప్రభుత్వ సేవలు ఇంటివద్దకే అందించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను నెలకొల్పారు. 2వేల జనాభాకు ఒకటి చొప్పున సచివాలయాన్ని ఏర్పాటు చేసి వాటి ద్వారా 500లకు పైగా సేవలందించారు.2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి 2024 ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు పథకాలు, ప్రభుత్వ సేవల కోసం ప్రజలు ఊరి దాటి వెళ్లాల్సిన అవసరం ఉండేది కాదు. అర్హత ఉంటే పథకాలు వెతుక్కుంటూ ఇంటి వద్దకే వచ్చేవి. ప్రతీ సచివాలయంలో 10 నుంచి 12 మంది ఉద్యోగులు ప్రజలకు సేవలందించే వారు. జనన, మరణ, ఆదాయ, నివాస, కులధ్రువీకరణ పత్రాలతో పాటు ఇతర సేవలు ఇంటిముంగిటకే అందేవి. అలాగే ప్రతీ 40 నుంచి 50 కుటుంబాలకు ఒక గ్రామ/ వార్డు వలంటీర్ పనిచేసేవారు. వీరు ప్రజలకు కావాల్సిన ధ్రువీకరణ పత్రాలతో పాటు పథకాలకు అర్హులను గుర్తించి, ఆ వివరాలు గ్రామ సచివాలయానికి అందజేసి వారికి పథకాలు, ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసే వారు. చీపురుపల్లి నియోజకవర్గంలోని చీపురు పల్లి, గరివిడి, గుర్ల, మెరకముడిదాం మండలాల్లో 84 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. ఈ సచివాలయాల ద్వారా రూపాయి అవినీతి లేకుండా ప్రజలు సేవలు, పథకాలు అందేవి. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయాల్లో చాలా సేవలు నిలిచిపోయాయి. గతంలో 500కు పైగా సేవలందేవి, ప్రస్తుతం వాటిలో సగం కూడా అందడం లేదని ప్రజలు వాపోతున్నారు. సంక్షేమ పథకాలు, ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజలకు ఎక్కడకి వెళ్లాలో.. ఎవరితో చెప్పుకోవాలో.... ఎలా దరఖాస్తు చేసుకోవాలో...దరఖాస్తు చేసుకుంటే పథకం ఎప్పుడు మంజూరవుతుందో తెలియని దుస్థితి నెలకొంది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో కొత్తగా ఒక్కటంటే ఒక్క రేషన్ కార్డు కూడా మంజూరు కాలేదు. గత ప్రభుత్వంలో రేషన్ కార్డుకు సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే వారంలోపల మంజూరయ్యేది.కొందరికైతే 48 గంటలలోపలే మంజూరయ్యేవి. ప్రస్తుతం సచివాలయాల ద్వారా కొత్త రేషన్‌కార్డులు మంజూరు కాకపోవడంతో కార్డులు అవసరమైన వారికి ఏం చేయాలో అర్థం కావడం లేదు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు పింఛన్ల కోసం ఎక్కడ దరఖాస్తు చేసుకోవాలో తెలియని దుస్థితి నెలకొంది. పథకాల సంగతి పక్కన పెడితే ధ్రువీకరణ పత్రాలతో పాటు ఏ చిన్న ప్రభుత్వ సేవ కోసమైనా మండల కేంద్రాల్లోని కార్యాలయాలు, మీసేవ కేంద్రాలు, నెట్ సెంటర్లకు వెళ్లాల్సి వచ్చేది.

వంట నిర్వాహకులకు నోటీసు

సాక్షి ఎఫెక్ట్

చీపురుపల్లి: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన వంట నిర్వాహకులకు నోటీసులు ఇచ్చి వారి నుంచి వివరణ తీసుకున్నామని జిల్లా విద్యాశాఖాధికారి(డీఈఓ) యు.మాణిక్యంనాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇక్కడి పాఠశాలలో ఈనెల 4న మధ్యాహ్న భోజనంలో పురుగులు కనిపించిన నేపథ్యంలో 'పురుగుల అన్నం తినలేక' అనే శీర్షికతో 'సాక్షి' పత్రికలో 5వ తేదీన కథనం వెలువడింది. దీనికి జిల్లా కలెక్టర్, డీఈఓ స్పందించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 5న జిల్లా ఉపవిద్యాశాఖాధికారి ద్వారా పాఠశాలలో సమగ్ర విచారణ జరిపించి, నివేదిక తెప్పించుకున్నామని డీఈఓ పేర్కొన్నారు. ఈనెల 4న మధ్యాహ్న భోజనంలో బిర్యానీ వండేందుకు బియ్యాన్ని ఒక్కసారి మాత్రమే కడగడంతో ధాన్యం పొట్టు బియ్యం నుంచి వేరు కాలేదని, అరగంటలో విద్యార్థులకు మళ్లీ భోజనం వండి పెట్టినట్లు నివేదిక అందిందని తెలిపారు. అయినప్పటికీ పాఠశాల హెచ్‌ఎం ద్వారా మధ్యాహ్న భోజన నిర్వాహకులకు నోటీసులు ఇచ్చామని, దీనికి వంట నిర్వాహకులు ప్రథమ పొరపాటుగా భావించాలని మరోసారి పొరపాటు జరగదని సమాధానం ఇచ్చినట్లు స్పష్టం చేశారు.

ప్రీమియం చెల్లింపునకు 15వరకు గడువు

మెరకముడిదాం: వాతావరణ ఆధారిత పంటల బీమా పథకంలో భాగంగా మామిడి పంటకు బీమా ప్రీమియం చెల్లించేందుకు ఈనెల15వ తేదీతో గడువు ముగియనుందని చీపురుపల్లి హెచ్‌ఓ చంద్రశేఖర్ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎకరా మామిడి పంటకు రూ. 2వేలు ప్రీమియం చెల్లిస్తే వాతావారణ పరిస్థితుల వల్ల పంటకు నష్టం వాటిల్లినప్పుడు గరిష్ఠంగా రూ.40 వేల బీమా వర్తిస్తుందన్నారు. పూర్తి వివరాలకు రైతు సేవా కేంద్రాల్లోని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, ఉద్యానవనశాఖ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. మండలంలో 20 వేల ఎకరాల్లో మామిడి సాగులో ఉందని, ఈ రైతులంతా బీమాపథకాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు.

న్యాయం జరిగే వరకు పోరుబాట



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

చీపురుపల్లి: కర్లాం వద్ద ఉన్న వెంకట్రామా పౌల్ట్రీస్ పరిశ్రమలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న కార్మికులకు యాజమాన్యం న్యాయం చేసేంత వరకు పోరుబాట కొనసాగిస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి టి.వి.రమణ చెప్పారు. వేతన ఒప్పందం అమలు చేయాలని కోరుతూ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని గెడ్డమిల్లు జంక్షన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు మంగళవారం నిరసన ర్యాలీ చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద టి.వి.రమణ మాట్లాడుతూ 2024 మే 31న నూతన వేతన ఒప్పందం అమలు చేయాల్సి ఉన్నప్పటికీ పరిశ్రమ యాజమాన్యం ఇంతవరకు అమలు చేయలేదన్నారు. ఆరుసార్లు చర్చల పేరుతో కాలయాపన చేశారే తప్ప వేతన ఒప్పందం చేయడం లేదన్నారు. గత 12 ఏళ్లుగా కార్మికుల శ్రమ దోపిడీకి యాజమాన్యం పాల్పడుతోందని మండిపడ్డారు. ప్రస్తుతం ఇస్తున్న వేతనంపై రూ.3వేలు వేతనం పెంచాలని కోరుతుంటే.. ఎప్పుడో 15 ఏళ్ల క్రితం ఉన్న జీఓలను అమలు చేస్తామని యాజమాన్యం చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కార్మికులు ఇప్పటికే రిలే నిరాహార దీక్షల ద్వారా నిరసన తెలుపుతున్నారని, యాజమాన్యం వేతన ఒప్పందం అమలు చేయకపోతే భవిష్యత్‌లో పోరుబాట ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈనెల 16న ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలపనున్నట్లు చెప్పారు. సీఐటీయూ డివిజన్ ఉపాధ్యక్షుడు అంబల్ల గౌరునాయుడు, కార్మిక సంఘ నాయకులు గురునాయుడు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో సిద్ధం కండి



పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు రోజువారీ ప్రణాళికతో సిద్ధం కావాలని ఎంఈఓ జగదీశ్వరరావు విద్యార్థులకు సూచించారు. పరీక్షలకు సిద్ధమయ్యే విధానంపై వేపాడ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం సాయంత్రం అవగాహన కల్పించారు.ఎంఈఓ మాట్లాడుతూ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు తగిన ప్రణాళిక అవసమని అన్నారు. ఇంటి వద్ద ప్రిపరేషన్ అయ్యేందుకు సబ్జెక్టుల వారీగా షెడ్యూల్ రూపొందించుకోవాలని, ఏమైనా సందేహాలు ఉంటే ఉపాధ్యాయులతో నివృత్తి చేసుకోవాలని, సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. - వేపాడ

అవగాహనతో క్షయ అంతం



అవగాహనతోనే క్షయ వ్యాధి అంతమవుతుందని, వ్యాధి లక్షణాలను సకాలంలో గుర్తించి మందులు వాడితే నివారణ సాధ్యమని జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి అన్నారు. పెదమానాపురంలో దత్తిరాజేరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఆనంద్‌కుమార్‌తో కలిసి క్షయ వ్యాధిపై గ్రామస్తులకు మంగళవారం అవగాహన కల్పించారు. వ్యాధి లక్షణాలు, వ్యాప్తి చెందే విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యాధికారి వివరించారు. వ్యాధిగ్రస్తులకు పీహెచ్‌సీలో ఉచితంగా మందులు అందిస్తున్నామని, ఆరు నెలలు పాటు మందులు వాడి, మంచి పౌష్టికాహారం తీసుకుంటే వ్యాధి నయమవుతుందని చెప్పారు. అనంతరం క్షయపై అవగాహన కల్పిస్తూ ముద్రించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. పీహెచ్‌సీ వైద్యసిబ్బంది పాల్గొన్నారు. -దత్తిరాజేరు

'జీరో టిల్లేజ్' విధానమే మేలు



వరికోతలు చేసిన పొలాల్లో జీరోటిల్లేజ్ విధానంలో మొక్కజొన్న సాగు చేయడం అన్ని విధాలా మేలని ఏఓ అనురాధ అన్నారు. పెదకాద గ్రామంలో రైతులకు పెగ్ మార్కర్‌తో మొక్కజొన్న విత్తనాలు విత్తుకోవడంపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. వరికోతలు చేసిన పొలాల్లో దుక్కి చేయకుండా జీరోటిల్లేజ్ విధానంలో మొక్కజొన్న సాగుచేయడం వల్ల ఎకరానికి రూ.3వేల నుంచి రూ.4 వేల వరకు ఆదా అవుతుందని, విత్తనాలు వేసిన 24 గంటల లోపు కలుపు నివారణ మందు పిచికారీ చేసుకుంటే కూలీల ఖర్చు మిగులుతుందని ఏఓ చెప్పారు. మొక్కజొన్న, పెసర, మినప పంటలకు బీమా కోసం ఈనెల 15వ తేదీలోగా ప్రీమియం చెల్లించాలని రైతులకు సూచించారు. ఏఈఓ లీలాకృష్ణ పాల్గొన్నారు. -దత్తిరాజేరు

సమన్వయంతో పని చేస్తేనే అభివృద్ధి



గజపతినగరం: మాట్లాడుతున్న ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక



గుర్ల: మాట్లాడుతున్న జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు

గజపతినగరం: అధికారులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాల అభివృద్ధితో పాటు ప్రజల సమస్యలు పరిష్కార మ వుతాయని ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక అన్నారు. పంచాయతీల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల(పాత మండల పరిషత్ కార్యాలయం) ఆవరణలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బందికి మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లా డుతూ గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు తొలిప్రాధాన్యం ఇవ్వాలన్నారు, పారిశుద్ధ్య నిర్వహణ పక్కాగా చేపట్టా లని సూచించారు. ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, సురక్షిత తాగునీరు అందించాలని, పేదరిక నిర్మూలన కోసం కృషి చేయాలన్నారు. ఎంపీడీఓ బి.కల్యాణి మాట్లాడుతూ 13వ తేదీ వరకు శిక్షణ కొనసాగుతుందని చెప్పారు. సీహెచ్ఓ లక్ష్మి, ఎంఈఓ విమలమ్మలతో పాటు మండల అధికారులు పలువురు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

గుర్ల: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు తరచూ పారిశుద్ధ్య పనులు చేయించాలని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు గ్రామాల అభివృద్ధి, పరిశుభ్రతపై ఎంపీడీఓ శేషుబాబు ఆధ్వర్యంలో మంగళవారం శిక్షణ ఇచ్చారు. అతిథిగా హాజరైన జెడ్పీటీసీ మాట్లాడుతూ ఆరు బయట మలవిసర్జనను అరికట్టాలని, ప్రజలు వ్యక్తిగత మరుగుదొడ్లు వినియోగించేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పొట్నూరు సన్యాసినాయుడు, మండల అధికారులు పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

వేపాడ: మండలంలోని ఆకులసీతంపేట వద్ద అక్రమంగా మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ దేవి తెలిపిన వివరాలు.. అక్రమంగా మద్యం తరలిస్తున్నట్లు తమకు సమాచారం అందడంతో ఆ ప్రదేశానికి చేరుకుని దాడులో చేశామని చెప్పారు. ఓ వ్యక్తి అయిదు మద్యంసీసాలను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకుని, కేసు నమోదు చేశామని తెలిపారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన



ఉన్నత పాఠశాలలో మౌలిక సదుపాయాలపై ఆరాతీస్తున్న అధికారులు

వేపాడ: మండల కేంద్రంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఎంఈఓ బాలభాస్కరరావు, ప్రధానోపాధ్యాయుడు బీపీఏ రాజు మంగళవారం పరిశీలించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు విక్టరీ హైస్కూల్‌లో సదుపాయాలపై ఆరాతీశారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. విద్యుత్, తాగునీరు, ఫర్నీచర్ వంటి మౌలిక సదుపాయాలు ఉండేలా చూసుకోవాలన్నారు. మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ సదుపాయం ఉండాలన్నారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయించాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గిరిజనులు

శృంగవరపుకోట: పట్టణంలోని 1వ వార్డులో ఉంటున్న గిరిజనులకు ప్రత్యేక శ్మశాన వాటిక కోసం స్థలం కేటాయించాలని సీపీఎం మండల కార్యదర్శి మద్దిల రమణ, ఏపీ గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గిరిజనులు మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ ఎస్.కోటలోని సర్వే నంబర్ 164/2 లో స్థలాన్ని తమ పూర్వీకుల నుంచి శ్మశాన వాటికగా వాడుకుంటున్నామని, ఆ స్థలాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించుకుని, శ్మశాన వాటికకు రోడ్డు వేయకుండా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి శ్మశాన వాటికకు వేరొక చోట స్థలం కేటాయించాలని కోరారు. అనంతరం డీటీకి వినతిపత్రం అందజేశారు. 1వ వార్డు వాసులు ఆర్.మణి, లక్ష్మి, కన్నతల్లి, చంద్రకళ, ఎర్రయ్యమ్మ, గంగ, త్రివేణి, పద్మ పాల్గొన్నారు.

ఆక్రమణదారుడికి నోటీసులు



అక్రమంగా నిర్మించిన భవనం వద్ద హెచ్చరిక బోర్డుఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

బొండపల్లి: అంబటివలసలో ప్రభుత్వ వాగు భూమిని ఆక్రమించి భవన నిర్మాణం చేపట్టిన గ్రామానికి చెందిన కెల్ల చంద్రరావుకు రెవెన్యూ అధికారులు మంగళవారం నోటీసులు జారీ చేశారు. ఆర్ఐ ఎస్.హరికృష్ణ మాట్లాడుతూ అంబటివలసలో సర్వే నంబర్ 69-2లో చంద్రరావు అనే వ్యక్తి వాగుగోర్జును ఆక్రమించి భవన నిర్మాణం చేపడుతున్నట్లు ఫిర్యాదు అందిందని చెప్పారు. స్థానిక వీఆర్ఓతో కలిసి వాగును పరిశీలించి, ఆక్రమణలను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని తెలిపారు.

రెవెన్యూ సదస్సులతో భూసమస్యల పరిష్కారం



గజపతినగరం: ముచ్చర్లలో రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ రత్నకుమార్, జెడ్పీటీసీ తవుడు



బొండపల్లి: దేవుపల్లిలో రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

గజపతినగరం: భూసమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ బి.రత్నకుమార్ తెలిపారు. మండలంలోని కెంగువ,ముచ్చర్ల గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. అడంగల్ కరక్షన్, మ్యుటేషన్, సాగు, పట్టాదారు పాసుపుస్తకాలు తదితర భూసమస్యలను పరిష్కరించాలని కోరుతూ రైతులు అర్జీలు అందజేశారు. స్థానిక సబ్‌రిజిస్ట్రార్ ఎస్.తవిటయ్య, డీటీ శోభారాణి, జెడ్పీటీసీ గార తవుడు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వేపాడ మండలంలో..

వేపాడ: మండలంలోని వీలుపర్తి, వెల్దాం గ్రామాల్లో మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ,తహసీల్దార్ జె.రాములమ్మ ఆధ్వర్యంలో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు.మ్యుటేషన్ల కోసం వెల్దాంలో ఎనిమిది మంది, వీలుపర్తిలో అయిదుగురు రైతులు అర్జీలు అందజేశారు. ఆయా గ్రామాల పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

దత్తిరాజేరు మండలంలో..

దత్తిరాజేరు: చినకాద, కన్నాం గ్రామాల్లో ఇన్‌చార్జ్ తహసీల్దార్ వరప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. పలువురు రైతులు తమ భూసమస్యలను పరిష్కరించాలని కోరుతూ అర్జీలు అందజేశారు. సదస్సుకు ముందు గ్రామంలో రైతులతో కలిసి రెవెన్యూ సిబ్బంది ర్యాలీ చేశారు.

బొండపల్లి మండలంలో..

బొండపల్లి: మండలంలోని దేవుపల్లి,ఐ.వి.అగ్రహారం గ్రామాల్లో తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఏమైనా భూసమస్యలు ఉంటే అర్జీలు అందజేయాలని, 45 రోజుల్లో సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. ఎంపీపీ చల్లా చలంనాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భగవద్గీత శ్లోకపఠన పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

శృంగవరపుకోట: గీతా జయంతి సందర్భంగా స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో పట్టణానికి చెందిన పెద్దింటి లక్ష్మిదేవి, పుష్పరాణి, కె.పావని అధ్వర్యంలో పాఠశాల స్థాయి విద్యార్థులకు మంగళవారం భగవద్గీత శ్లోకపఠన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు పట్టణంతో పాటు మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. పట్టణంలోని నారాయణ పాఠశాలకు చెందిన 5వ తరగతి విద్యార్థిని బొబ్బిలి లాస్య ప్రథమ స్థానంలో నిలించిది. ద్వితీయ, తృతీయ స్థానాల్లో అదే పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థులు బొబ్బిలి హృషికేష్, కటకం తన్విక నిలిచారు. విజేతలకు కథా రచయిత్రి కొల్లా పుష్పరాణి చేతుల మీదుగా బహుమతులు అందచేశారు.